క్లుప్తంగా...

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.13, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 18, బెండకాయ 45, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 38, పందిరి బీర 50, క్యాబేజీ 11, క్యారెట్ 17, దొండ 35, గుండుబీన్స్ 65, గింజ చిక్కుడు 55, గోకరకాయ 55, కీర 13, దోసకాయ 23, బీట్‌రూట్ 15, ఉల్లిగడ్డ 15, ఆలుగడ్డ 18, చామగడ్డ 55, మొరంగడ్డ 15, కందగడ్డ 40, సొరకాయ 9, పొట్లకాయ 15, అరటికాయ 9, మునగకాయ 4–6, ముల్లంగి 3–5. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

7న సీతాఫల్‌మండిలో జాబ్‌మేళా

సికింద్రాబాద్: సెట్విన్ సంస్థతో పాటు మరిన్ని సంస్థల సహకారంతో ఈ నెల 7న జాబ్‌మేళా నిర్వహించనున్నారు. శాసనసభ డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ జన్మదినాన్ని పురస్కరించుని టీఆర్ఎస్ నాయకులు సీతాఫల్‌మండి మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్లో జాబ్ మేళాను ఏర్పాటు చేశారు. పదవ తరగతి నుంచి పీజీ, ఇంజినీరింగ్ తదితర వృత్తి విద్యాకోర్సులు చదివిన అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం కోసం 30 పేరొందిన సంస్థలను ఆహ్వానించినట్లు నిర్వాహకులు తెలిపారు. రూ.15 వేల కనీస వేతనం నుంచి పెద్ద మొత్తంలో వేతనాలు అందించేందుకు జరిగే ఉద్యోగ నియామకాల్లో అర్హులంతా పాల్గొనాలన్నారు.

10వ తేదీ నుంచి జార్జిరెడ్డి వర్ధంతి కార్యక్రమాలు


మాట్లాడుతున్న నాగేశ్వర్‌రావు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పూర్వ విద్యార్థి పీడీఎస్‌యూ వ్యవస్థాపకుడు జార్జిరెడ్డి వర్ధంతి పురస్కరించుకొని వర్సిటీలో వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పీడీఎస్‌యూ నేతలు పేర్కొన్నారు. మంగళవారం ఓయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జాతీయ నాయకులు ఎస్. నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. ఈ నెల 14న జార్జిరెడ్డి వర్ధంతి సందర్భంగా పీడీఎస్‌యూ స్పోర్ట్స్ లీగ్ పేరుతో ఈ నెల 10 నుంచి 12 వరకు వివిధ క్రీడాపోటీలు, 13న జార్జిరెడ్డి సినిమా ప్రదర్శన, 14న బహిరంగ సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. వర్ధంతి కార్యక్రమాలలో విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సుమంత్, స్వాతి, రుక్మత్‌పాషా, చిరంజీవి, నరేష్, సాయికుమార్, క్రాంతి, మహేష్, మధులత, మనిదీప్, తరుణ్, సంధ్య, సృజన, వినయ్, రాజేష్ పాల్గొన్నారు.

అభినందన


విద్యార్థిని సిరివెన్నెలను అభినందించిన దృశ్యం

అమీర్‌పేట: నాసా ఎస్.ఎస్.స్పేస్ సెటిల్మెంట్ పోటీల్లో ప్రపంచ చాంపియన్‌గా శ్రీచైతన్య స్కూల్ నిలిచిందని అమీర్‌పేట జోన్ ఏజీఎం శివరామకృష్ణ తెలిపారు.స్పేస్‌లో స్థానం దక్కించుకున్న విద్యార్థులను మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన అభినందించారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు ప్రశంసనీయం


టాయిలెట్లను ప్రారంభిస్తున్న దృశ్యం

రసూల్‌పురా: స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వ పాఠశాల్లో చదువుతున్న పేద విద్యార్థుల కోసం చేస్తున్న సేవలు ప్రశంసనీయమని మడ్‌ఫోర్ట్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం .ఆశీర్వాదం అన్నారు. వాటర్ ఏయిడ్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో రూ. 3 లక్షలతో నిర్మించిన టాయిలెట్లను మంగళవారం ఆయన సంస్థ ప్రతినిధులు మేరి, హరిప్రసాద్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆశీర్వాదం మాట్లాడుతూ.. టాయిలెట్లు లేక ఇబ్బందులు పడుతుండడంతో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించి వారు కార్పొరేట్ పాఠశాల తరహా టాయిలెట్లు నిర్మించేలా చొరవ తీసుకున్నారన్నారు.

'గాంధీ డైట్'కు టెండర్ల ఆహ్వానం

గాంధీఆస్పత్రి : సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు, వైద్యులకు ఆహార పదార్థాలు సరఫరా చేసేందుకు డైట్ టెండర్లకు ఆహ్వానిస్తున్నట్లు ఆస్పత్రి పాలన యంత్రాంగం తెలిపింది. నియమ నిబంధనలు, ఇతర వివరాలను సూపరింటెండెంట్ కార్యాలయంలోని హెచ్‌డీఎస్ సెక్షన్‌లో పొందవచ్చని ఈ నెల 17వ తేదీ వరకు దరఖాస్తులు అందుబాటులో ఉంటాయని, 18న మధ్యాహ్నం 12 గంటలకు టెక్నికల్, 2.30 గంటలకు ఫైనాన్సియల్ బిడ్లు తెరుస్తారని, అర్హులైన వారంతా టెండరు ప్రక్రియలో పాల్గొనాలని పేర్కొన్నారు.



నో ఇన్‌చార్జ్.. అసమ్మతి ఫుల్‌చార్జ్

కంటోన్మెంట్ బీఆర్ఎస్‌లో గందరగోళం

సాయన్న మరణంతో పెద్ద దిక్కు కరువు

ఎమ్మెల్యే టికెట్ రేసులో అరడజను ఆశావహులు

ఓ వైపు మంత్రుల ఆధిపత్యం, మరోవైపు అసమ్మతి పోరు

కంటోన్మెంట్: కంటోన్మెంట్ బీఆర్ఎస్‌లో ఆధిపత్య పోరు రోజురోజుకీ తీవ్రమవుతోంది. పార్టీకి పెద్దదిక్కుగా ఉన్న ఎమ్మెల్యే సాయన్న మరణంతో నేతలందరినీ ఒక్కతాటిపై నడిపించే వారు కరువయ్యారు.ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తున్న వారు ఎవరికి వారే తమ ఉనికి చాటేందుకు ఆరాటపడుతున్నారు. అంతేకాక ఇద్దరు మంత్రులు సైతం నియోజకవర్గంలో పార్టీకి తామే పెద్దదిక్కు అనేలా క్యాడర్‌ను తమ వైపునకు తిప్పుకునే ప్రయత్నాల్లో ఉన్నారు. ఈ నేపథ్యంలో నిర్వహిస్తున్న ఆత్మీయ సమ్మేళనాల్లో తాము ఎవరి వెంట నడవాలో అర్థం నాయకులు, కార్యకర్తలు తలలు పట్టుకుంటున్నారు. భౌగోళికంగా హైదరాబాద్ జిల్లాలో ఉండే కంటోన్మెంట్ నియోజకవర్గం పార్లమెంట్ విషయానికొస్తే మల్కాజ్‌గిరి పరిధిలో ఉంటుంది. ఆది నుంచీ మల్కాజ్‌గిరి ఎంపీ లేదా ఎంపీ అభ్యర్థులే ఇక్కడ ఆధిపత్యం చేలాయిస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో గతంలో మల్కాజ్‌గిరి ఎంపీ అయిన ప్రస్తుత మంత్రి మల్లారెడ్డి సహజంగానే పార్టీ నేతలకు పెద్ద దిక్కుగా ఉంటున్నారు. 2019లో బీఆర్ఎస్ పార్టీ నుంచి పోటీ చేసి ఓటమిపాలైన మంత్రి మల్లారెడ్డి అల్లుడు రాజశేఖర్ రెడ్డి కూడా అదే ధోరణిలో బోర్డు సభ్యులంతా తనవైపే ఉండేలా జాగ్రత్తలు పడుతూ వచ్చారు. దివంగత ఎమ్మెల్యే సాయన్న సైతం మల్లారెడ్డి ఆధిపత్యాన్ని ప్రశ్నిస్తూ వచ్చారు. ఈ క్రమంలోనే బోర్డు ఎన్నికల ప్రకటన వెలువడటంతో సహజంగానే మల్లారెడ్డి తన వర్గంలోని బోర్డు మాజీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. రెండు రోజుల అనంతరం ఎమ్మెల్యే సాయన్న మృతి చెందడంతో ఒక్కసారిగా పరిస్థితుల్లో తారుమారు అయ్యాయి.


కేడర్‌లో సమన్వయం కోసం మంత్రి తలసాని కార్యాలయంలో నిర్వహించిన సమావేశం (ఫైల్)

కీలకంగా మారిన మంత్రి..

ఎమ్మెల్యే సాయన్న దశదిన కర్మ ముగిసిన మరుసటి రోజే మంత్రి తలసాని, సాయన్న కుమార్తెలు లాస్య నందిత, నివేదితలతో పాటు బోర్డు మాజీ సభ్యుల్లో జక్కుల మహేశ్వర్ రెడ్డి (జేఎమ్మార్)ను తన నివాసానికి పిలిపించుకుని మాట్లాడారు. అక్కడికక్కడే విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి బోర్డు ఎన్నికల్లో పార్టీ కార్యాచరణ ప్రకటించడంతో పాటు, సర్వసభ్య సమావేశానికి పిలుపునిచ్చారు. అనివార్య కారణాల వల్ల సర్వసభ్య సమావేశం రెండు సార్లు వాయిదా పడుతూ వచ్చింది. దీంతో మరోసారి ఎమ్మెల్యే కూతుర్లు, జేఎమ్మార్‌తో పాటు మల్లారెడ్డి వర్గంలోని మరో ముఖ్య నేత బోర్డు మాజీ సభ్యుడు పాండుయాదవ్‌ను తన వద్దకు పిలిపించుకుని మాట్లాడారు. తదనంతరం తెలంగాణ భవన్‌లో తన ఆధ్వర్యంలోనే ఆత్మీయ సమ్మేళనాల సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. అయితే ఈ కార్యక్రమానికి సైతం మల్లారెడ్డిని ఆహ్వానించలేదు. బోర్డు మాజీ సభ్యులు సైతం మల్లారెడ్డి రాజశేఖర్‌రెడ్డికి సమాచారం ఇవ్వకుండానే ఈ భేటీలకు వెళ్లడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక పార్టీ టికెట్ ఆశిస్తున్న కార్పొరేషన్ల చైర్మన్‌లు మన్నె కృశాంక్, ఎర్రోళ్ల శ్రీనివాస్, గజ్జెల నాగేశ్‌లను కూడా ఈ భేటీకి పిలవకపోవడం పట్ల అసహనం వ్యక్తం చేశారు.

దిద్దుబాటులోనూ..

గత నెల 25 బొల్లారంలో నిర్వహించిన తొలి ఆత్మీయ సమ్మేళనం పార్టీలోని అసమ్మతిని బహిర్గతం చేసింది. మాజీ బోర్డు సభ్యులే వార్డుల అనధికారిక ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరిస్తూ ఉండటాన్ని పలువురు నేతలు తప్పుబట్టారు. మన్నె కృశాంక్, గజ్జెల నాగేశ్, ఎర్రోళ్ల శ్రీనివాస్‌లను ఈ సమావేశానికి ఆహ్వానించలేదు. గత ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీ చేసి ప్రస్తుతం బీఆర్ఎస్‌లో కొనసాగుతున్న శ్రీగణేశ్‌ను సైతం పార్టీ నేతలు దూరంగానే పెట్టారు. ఈ నేపథ్యంలో కార్పొరేషన్ చైర్మన్‌లు తమ అసంతృప్తిని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో దిద్దుబాటు చర్యల్లో భాగంగా మంత్రి తలసాని మరోసారి రంగంలోకి దిగారు. ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని తన కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మంత్రితో పాటు ముఖ్య నేతలంతా హాజరైన ఈ సమావేశంలోనూ ఇన్‌చార్జ్ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో మరోసారి నేతలంతా ఎవరికి వారే అన్నట్లుగా ప్రజాక్షేత్రంలో కార్యకలాపాలు నిర్వహిస్తూ ఉండటం గమనార్హం. ఇక త్వరలో జరగబోయే ఎన్నికల్లో సాయన్న కుమార్తెల్లో ఒకరికి టికెట్ ఇవ్వాలని ఆయన వర్గీయులు డిమాండ్ చేస్తున్నారు. లేని పక్షంలో సాయన్న ప్రధాన అనుచరుల్లో ఒకరైన ముప్పిడి మధుకర్‌ను కొందరు నేతలు తెరపైకి తెస్తున్నారు. ఈ నేపథ్యంలో రాబోయే రోజుల్లో పార్టీ పరిస్థితి ఎలా మారుతుందోనని కార్యకర్తలు చర్చించుకుంటున్నారు.

మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను కలిసిన దళిత సంఘాల నాయకులు

లాలాపేట: పలువురు దళిత సంఘాల నాయకులు మంగళవారం ఎస్సీ అభివృద్ధి శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను మర్యాద పూర్వకంగా కలిసారు. తెలంగాణ నూతన సెక్రటేరియట్ భవనానికి అంబేద్కర్ నామకరణం చేయడం, 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం వంటి భారతదేశ చరిత్రలో కనీవిని ఎరుగని రీతిలో చారిత్రక నిర్ణయాలు ప్రకటించిన సీఎం కేసిఆర్‌కు భీమ్ రక్ష ఫెడరేషన్ ఆధ్వర్యంలో కృతజ్ఞతలు తెలిపారు. 125 అడుగుల అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ సందర్భంగా 125 మంది ప్రముఖులు, సీనియర్ అంబేద్కర్ వాదులు, ఉద్యమకారులను గుర్తించి వారికి రివార్డుతో కూడిన అవార్డులను అందజేయాలని ఈ సందర్భంగా మంత్రికి వినతి పత్రాన్ని సమర్పించారు.


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న దళిత సంఘాల నాయకులు

మంత్రిని కలిసిన వారిలో రావుల అంజయ్య, మట్టుపల్లి సుబ్బారాయుడు, మహేశ్ బాబు, బూర్గుల వెంకటేశ్వర్లు, రావుల విజయ్ కుమార్, దీపక్ కుమార్, సురేష్ ఉన్నారు.

సన్మానం


నాగేశ్వరరావును సత్కరిస్తున్న దృశ్యం

రాంగోపాల్‌పేట్: హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన పల్లె నాగేశ్వరరావును మంగళవారం గ్రేటర్ హైదరాబాద్ వైఎంసీఏ అధ్యక్షులు జయకర్ డేనియల్, కార్యదర్శి లినార్డ్ మైరెన్ కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా డేనియల్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు దళిత వర్గాల నుంచి ఈ స్థాయికి చేరుకున్న వాళ్లు చాలా అరుదని పల్లె నాగేశ్వరరావు దళిత కుటుంబంలో పుట్టి తన ప్రతిభ పాటవాలతో ఈ స్థాయికి చేరుకున్నారని కొనియాడారు. పల్లె నాగేశ్వరరావు మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

రాంగోపాల్‌పేట్: అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవడంతో ఆస్తి, ప్రాణనష్టాన్ని నివారించవచ్చని సికింద్రాబాద్ ఫైర్ ఆఫీసర్ మోహన్‌రావు అన్నారు. మంగళవారం సికింద్రాబాద్ ప్యారడైజ్ చౌరస్తాలోని చంద్రలోక్ కాంప్లెక్స్‌లో దుకాణాలు, కార్యాలయాల యజమానులకు అగ్ని ప్రమాద నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. 50 ఏళ్ల నాటి చంద్రలోక్ కాంప్లెక్స్ భవనంలో సుమారు 200కు పైగా దుకాణాలు, వివిధ కార్యాలయాలతో పాటు రెసిడెన్షియల్ ఫ్లాట్లు ఉన్నాయని చెప్పారు. ఇంత పెద్ద కాంప్లెక్స్‌లో అగ్నిమాపక నివారణ చర్యలు తీసుకోకపోతే పెద్దఎత్తున ఆస్తి, ప్రాణ నష్టాలు జరిగే ప్రమాదం ఉంటుందన్నారు. భవనంలోని మెట్ల మార్గాల్లో నడిచి వెళ్లేలా ఏర్పాట్లు ఉండాలని వాటిని మూసి ఉంచరాదన్నారు. అత్యవసర ద్వారాలు తెలిసేలా బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి ఫ్లోర్, ఆఫీసుల్లో అగ్ని ప్రమాదాలను నివారించే సిలిండర్లు, స్మోక్ డిటెక్టర్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సికింద్రాబాద్‌లో ఇప్పటికే 1150 మంది వ్యాపారులకు నోటీసులు జారీ చేశామని, వాటికి స్పందించకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదాల్లో ప్రాణాలు పోవడానికి ప్రధాన కారణం అగ్నిమాపక చర్యలు చేపట్టకపోవడం, ప్రమాదాలు జరిగినపుడు ఎలా తప్పించుకోవాలని అవగాహన లేకపోవడం లాంటి అనేక మానవ తప్పిదాలే కారణం అన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రలోక్ కాంప్లెక్స్ అసోసియేషన్ కార్యదర్శి మహిపాల్‌రెడ్డి, సీనియర్ మెంబర్లు జితేందర్‌రెడ్డి, చింతలపాటి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.


చంద్రలోక్ కాంప్లెక్స్‌లో అవగాహన కల్పిస్తున్న మోహన్‌రావు

సమస్యల పరిష్కారమే ధ్యేయం


మోండా డివిజన్‌లో పర్యటిస్తున్న నేతలు

కంటోన్మెంట్: నియోజకవర్గంలోని పెండింగ్ సమస్యల పరిష్కారమే ధ్యేయమని బీఆర్ఎస్ నాయకురాలు లాస్య నందిత అన్నారు. మంగళవారం మోండా డివిజన్‌లోని ఎల్. శంకర్‌నగర్‌లో సోదరి నివేదిత, స్థానిక నేతలతో కలిసి ఆమె పర్యటిస్తూ స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తన తండ్రి దివంగత ఎమ్మెల్యే సాయన్న చేపట్టిన అభివృద్ధి పనులన్నీ సకాలంలో పూర్తయ్యేలా చూస్తామన్నారు. ఆయన హామీ ఇచ్చిన పనులతో పాటు ప్రజా సమస్యలను తీర్చడమే తమ లక్ష్యమని నిరంతరం ప్రజల మధ్యే ఉంటూ తమ తండ్రి ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తామన్నారు. అనంతరం నెహ్రూ పార్కులో స్థానికులతో ముచ్చటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

'టీ-సేవ్'కు ఓయూ విద్యార్థి సంఘాల మద్దతు

ఉస్మానియా యూనివర్సిటీ: పార్టీలకు అతీతంగా ఏర్పాటుకు చేసిన టీ-సేవ్‌కు ఓయూ విద్యార్థి జేఏసీతో పాటు 20 సంఘాలు మద్దతు తెలిపినట్లు వైఎస్‌టీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు నాగరాజు చక్రవర్తి పేర్కొన్నారు. మంగళవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట టీ-సేవ్ మద్దతు తెలిపిన విద్యార్థి నాయకులతో సమావేశమయ్యారు. విద్యార్థులు, నిరుద్యోగులకు జరుగుతున్న అన్యాయంపై ఉమ్మడిగా పోరాడేందుకు వైఎస్ఆర్‌టీపీ అధినేత్రి షర్మిల ఏర్పాటు చేసిన టీ-సేవ్‌కు ప్లకార్డులను ప్రదర్శిస్తూ స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థి నేతలు మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్సీలో జరుగుతున్న అక్రమాలకు పోరాటాల ద్వారానే న్యాయం జరుగుతుందన్నారు. ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో అవినీతి అక్రమాలకు తావులేకుండా భవిష్యత్‌లో విద్యార్థులు, నిరుద్యోగుల పక్షాన ఉద్యమించేందుకు అన్ని సంఘాల నేతలు ఒకే గొడుగు కింద పోరాడేందుకు ముందుకురావాలని కోరారు. త్వరలో రాష్ట్రంలోని అన్ని వర్సిటీలలో పర్యటించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శివరెడ్డి, విజయ్, అశోక్, కౌశిక్ రెడ్డి, ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.


టి-సేవ్ ప్లకార్డులను ప్రదర్శిస్తున్న విద్యార్థి నేతలు

రసూల్‌పురాలో ఇఫ్తార్ విందు


ఖర్జూరం తినిపించి ఉపవాస దీక్ష విరమింపజేయిస్తున్న గజ్జేల నాగేష్

రసూల్‌పురా: పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకుని రసూల్‌పురా మజీద్ ఈ–లాహి వద్ద మంగళవారం ఎండీ యాసిన్, ఎండీ. అబ్బు ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. రాష్ట్ర బెవరేజేస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జేల నాగేష్ హాజరై ఉపవాసం ఉన్న వారికి ఖర్జూరాలు తినిపించి విరమింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత సామరస్యానికి రంజాన్ ప్రతీక అని కులమతాలకతీతంగా పండగలు నిర్వహించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అజామ్, షర్ము, ఖాజా, నగేష్, హర్షద్, కరీం, వాహబ్, సతీష్, రాజు పాల్గొన్నారు.

శోభాయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

లాలాపేట: హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయాలనీ హిందూ వాహినీ తెలంగాణ స్టేట్ కో కన్వీనర్ చంద్రకాంత్ పిలుపునిచ్చారు. లాలాపేటలోని మున్సిపల్ మైదానంలో మంగళవారం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు. శ్రీరామనవమి అనంతరం నిర్వహించే హనుమాన్ శోభాయాత్రను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్న నేపథ్యంలో అఖిలపక్షం నాయకులు పాల్గొనాలని కోరారు. ఈ నెల 6న సాయంత్రం ఓల్డ్ లాలాపేట దర్వాజమైసమ్మ దేవాలయం నుంచి శోభాయాత్ర ప్రారంభం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సాయి, అనీల్ యాదవ్, విమల్, విశాల్, సందీప్, మహేశ్, నాగరాజు పాల్గొన్నారు.


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే ఉపేక్షించొద్దు

పోలీసులకు మంత్రి ఆదేశం

అమీర్‌పేట: ప్రజలను ఇబ్బందులకు గురిచేసే విధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తప్పవని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ హెచ్చరించారు. అమీర్‌పేట డివిజన్ శివబాగ్ కాలనీలో వివిధ శాఖల అధికారులతో కలిసి మంగళవారం ఆయన పర్యటించారు.రాత్రి వేళల్లో జన్మదిన వేడుకల పేరుతో రోడ్లపై డీజేలు పెట్టి ఇబ్బందులు కలిగిస్తున్నారని కాలనీ వాసులు తెలిపారు.అలాంటి వారు ఎవరైనా సరే ఉపేక్షించవద్దని, కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఆర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదులును ఆదేశించారు. కాలనీలోని పార్కును సందర్శించి పార్కు అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. వాకింగ్ ట్రాక్ నిర్మాణంతో పాటు మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని చెప్పారు.ఒక బోర్ వేయాలని కోరగా వెంటనే ఏర్పాటు పనులు చేపట్టాలని, 3 నెలల్లో పార్కును అత్యంత సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. పార్కు స్థలాన్ని ఆక్రమించేందుకు కొందరు వ్యక్తులు ప్రయత్నిస్తున్నారని మంత్రి దృష్టికి తీసుకురాగా పార్కులు, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించే వారి విషయంలో ప్రభుత్వం చాలా కఠినంగా వ్యవహరిస్తుందని స్పష్టం చేశారు. పార్కు విషయంలో ఎలాంటి ఆందోళనవద్దని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, జోనల్ కమిషనర్ రవికిరణ్, వివిధ శాఖల అధికారులతో పాటు బీఆర్ఎస్ నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.


స్థానికులతో మాట్లాడుతున్న మంత్రి తలసాని

మంత్రికి ఆహ్వానం..

రాంగోపాల్‌పేట్: ఈ నెల 6వ తేదీన సికింద్రాబాద్ ఎస్పీరోడ్‌లోని వీర హనుమాన్ దేవాలయంలో జరిగే హనుమత్ విజయోత్సవానికి హాజరు కావాలని మంత్రి తలసానిని ఆహ్వానించారు. దేవాలయ ఈవో శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో మంగళవారం ఆలయ సిబ్బంది, అధికారులు మంత్రిని ఆయన నివాసంలో కలిసి పూజల్లో పాల్గొనాలని కోరారు.

రైల్వే ఉద్యోగులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

లాలాపేట: తార్నాక ఇరిసెట్‌లోని రైల్వే అధికారులు, ఉద్యోగులకు మంగళవారం బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు , సిబ్బంది జ్యోతి తదితరులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా స్టాప్‌లైన్, రాంగ్ రూట్, ట్రిబుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. సిగ్నల్ లైట్స్, వాహనాలు ఇచ్చే దిశా సంకేతాలపై అవగాహన కల్పించారు. జీబ్రా క్రాసింగ్ వద్ద మాత్రమే రోడ్డు దాటాలని, తప్పకుండా డ్రైవింగ్ లైసెన్స్, ఫిట్నెస్ సర్టిఫికెట్‌లను దగ్గర ఉంచుకోవాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు నడిపించే వారు సీటు బెల్ట్ కచ్చితంగా పెటుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిసెట్ డైరెక్టర్ జనరల్ సుధీర్ కుమార్, దాదాపు 300 మంది రైల్వే ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శంకర్‌రాజు

కమ్యూనిటీహాళ్లలో మెరుగైన వసతులు కల్పిస్తా

రసూల్‌పురా: రసూల్‌పురాలోని కమ్యూనిటీహాళ్లలో కనీస వసతులు లేక పేదప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని సొంత డబ్బులతో వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీ గణేష్ తెలిపారు. మంగళవారం ఆయన రసూల్‌పురా–105 గల్లీలో పర్యటిస్తూ స్థానికులతో మాట్లాడారు. స్థానికుల అభ్యర్థన మేరకు అంబేడ్కర్ యువజన సంఘం కమ్యూనిటీ హాల్‌ను సందర్శించారు. విద్యుదాఘాతం జరిగి సరఫరా లేదని, ఫ్యాన్లు కూర్చోవడానికి కుర్చీలు, అదే విధంగా డోర్లు లేవని స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఫ్యాన్లు, 50 కుర్చీలు, విద్యుత్ సౌకర్యం కోసం వైరింగ్, కమ్యూనిటీహాల్‌కు తలుపుల ఏర్పాటు, ఇతర ఫర్నిచర్ కోసం శ్రీ గణేష్ ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమం కోసం తాను ఎల్ల వేళలా అందుబాటులో ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో యాదగిరి, మల్లేశం, రాజు, నరసింహ, శోభ, ముత్తయ్య, రేణుక, ఎలమ్మ పాల్గొన్నారు.


బస్తీవాసులతో మాట్లాడుతున్న శ్రీ గణేష్

డివిజన్ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

బన్సీలాల్‌పేట్: డివిజన్ సమాగ్రాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలతో ముందుకెళ్తున్నామని కార్పొరేటర్ కే. హేమలత పేర్కొన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ పద్మారావునగర్ శ్రీనివాస్‌నగర్‌లో రూ. 5 లక్షల వ్యయంతో చేపట్టే నూతన సీవరేజీ పనులను మంగళవారం ఆమె పవన్‌కుమార్ గౌడ్, జలమండలి డీజీఎం క్రిష్ణ, మేనేజర్ నవ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారానికి నిర్మాణాత్మకమైన కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నట్లు వెల్లడించారు. ప్రజల సమస్యలు తన దృష్టికి వచ్చిన వెంటనే పరిష్కరిస్తున్నామన్నారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సహకారంతో డివిజన్‌లో అనేక సమస్యలు పరిష్కారం అయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో రాజు, ముక్కా శ్రీనివాస్, సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, లక్ష్మీపతి, ప్రేమ్ పాల్గొన్నారు.


పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ హేమలత

ఓయూలో విద్యార్థి నేతల అరెస్ట్


శవయాత్ర నిర్వహిస్తున్న విద్యార్థి నేతలు


విద్యార్థులను అడ్డుకున్న పోలీసులు

ఉస్మానియా యూనివర్సిటీ: కొత్త బోర్డు సభ్యులను నియమించాకే టీఎస్‌పీఎస్సీ ఉద్యోగాల రాత పరీక్షలు చేపట్టాలని ఓయూలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మకు శవయాత్ర జరిపిన విద్యార్థి నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం వర్సిటీ లైబ్రరీ నుంచి ఆర్ట్స్ కాలేజీ వరకు శవయాత్ర చేసి దహనం చేయబోగ పోలీసులు అడ్డుకున్నారు. బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వేల్పుల సంజయ్, ఓయూ జాక్ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి, అంబేడ్కర్, ప్రవీణ్, నవీన్, చందు, శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసి ఓయూ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

వీసీ చాంబర్ వద్ద పోలీసుల మోహరింపు..

ఓయూ వీసీ చాంబర్ కన్నా రాష్ట్ర మంత్రుల నివాసాలే నయమని పీహెచ్‌డీ విద్యార్థులు మండిపడ్డారు. పెంచిన పీహెచ్‌డీ ఫీజులను తగ్గించాలని మంగళవారం ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చేందుకు వెళ్లగా అనుమతి లేదని పోలీసులు రెండు గంటల పాటు అడ్డుకున్నారని ఏఐఎస్ఎఫ్ నేత సత్య పేర్కొన్నారు. విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం వీసీ ప్రొ.రవీందర్‌ను నియమిస్తే విద్యార్థులకు సమయం ఇవ్వకపోవడం దారుణమన్నారు. విద్యార్థుల పట్ల వీసీ రవీందర్ అనుసరిస్తున్న విధానాలతో సీఎం కేసీఆర్ ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతుందన్నారు.

కార్యవర్గ సమావేశం

సికింద్రాబాద్: సీతాఫల్‌మండికి చెందిన ఎస్సీ ఎస్టీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ తొలి సమావేశం మంగళవారం బీదలబస్తీలోని సంఘం కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా సికింద్రాబాద్ ప్రాంతంలోని ఎస్సీ ఎస్టీ వర్గాల సంక్షేమం కోసం వచ్చే ఏడాదిలో తీసుకోవాల్సిన కార్యాచరణపై చర్చించారు. అనంతరం కొత్త కార్యవర్గ ప్రతినిధులను సంఘం సభ్యులు సన్మానించి అభినందనలు తెలిపారు. సంఘం నూతన అధ్యక్షుడు కేపీ విద్యాసాగర్ కార్యవర్గ ప్రతినిధులు సీతారాం, జీఎం మల్లేశ్, గడ్డం ప్రసాద్, జీవీ కృష్ణ, చలపతిగిరి, తోబుల విష్ణు, భాస్కర్‌గిరి తదితరులు సమావేశానికి హాజరయ్యారు.



మహిళను వేధించిన వ్యక్తిపై కేసు

అమీర్‌పేట: ఓ ప్రైవేటు పాఠశాలలో పనిచేసే మహిళను వేధిస్తున్న వ్యక్తిపై ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. బల్కంపేటకు చెందిన ఓ మహిళ (33) ఓ స్కూల్లో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తోంది. సోమవారం ఎస్ఆర్‌నగర నుంచి బల్కంపేటకు నడుచుకుంటూ వెళ్తుండగా బబ్లూ (30) అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై ఆమెను వెంబడించి బెదిరింపులకు పాల్పడ్డాడు. వేగంగా బైక్ నడుపుతూ ఆమెను ఢీకొట్టేలా భయభ్రాంతులకు గురి చేశాడు. అంతేకాక ఇంటి వరకూ ఆమెను వెంబడించాడు. బాధితురాలు తన భర్తకు ఫోన్ చేయడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్స్పెక్టర్ సైదులు తెలిపారు.